# చెలగాటం

వేమూరి వేంకటేశ్వరరావు

అనగా అనగా ఒక రాజ్యాన్ని ఒక రాజు పాలించేవాడు. రాజు పేరు నాకు నిక్కచ్చిగా తెలియదు. అయినా పేరుతో మనకి అంతగా పని లేదు. ఈ కథ అఖండ భారత దేశంలో మాహాభారత కాలంలోనో మొగల్ సామ్రాజ్యపు రోజులలోనో జరిగుండొచ్చు. లేదా ప్రపంచంలో మరెక్కడైనా, మరెప్పుడైనా జరిగుండొచ్చు. అదీ నాకు ఇతమిత్థంగా తెలియదు. నన్నడిగితే ఆ విషయం కూడ మనకి అనవసరమే. మా తాతమ్మ మా అమ్మకి ఈ కథ చెప్పినప్పుడు ఈ ఊరు పేరు లేని రాజు మరెవరోకాదు, వాళ్ళ ఊరు మునసబు కర్కోటకుడు గారే అని అమ్మ ఊహించిందిట. ఈ కథని నేను తిరగ చెప్పినప్పుడు మా అమ్మాయి ఇది కచ్చితంగా రోమన్ సామ్రాజ్యపు కథ అయి ఉంటుందని చెప్పింది. మా ఇంట్లో ఆడ జనం - ఆబాల గోపాలం - నా కంటే ఎంతో తెలివైనదని నేను ఎప్పుడో ఒప్పేసుకున్నాను కనుక మూడొంతులు ఇది కర్కోటకుడు గారి కథైనా అయి ఉండొచ్చు, రోమన్ రాజు కథైనా అయి ఉండొచ్చు. లేక, ఈ కాలపు కథ అయినా నేను ఆశ్చర్యపోను.

అసలు కథ చెప్పనియ్యండి. మన రాజు కర్కోటకుడే కాకుండా కొంచెం చాదస్తపు ముండాకొడుకు కూడాను. తను పట్టుకున్న కుందేలుకి మూడే మూడు కాళ్ళు అనే రకం. కుక్క తోకని తిన్నగా అయ్యేటట్టు సాపు చేస్తానంటాడు. పోనీ ఎవడి వెర్రి వాడికి ఆనందం అనుకుని సర్దుకు పోదాం అంటే వీలయే పనా? అంతా తను అనుకున్న పద్ధతిలోనే జరగాలని మంకుపట్టు పట్టేవాడు. ఈ పప్పులు పెళ్ళాం దగ్గర, కూతురు దగ్గర ఉడికేవు కాదు కాని నోరు, వాయి లేని ప్రజల దగ్గర ఉడికేవి.

ఒక సారి అకస్మాత్తుగా ఈ రాజు బుర్రలో ఒక ఊహ మెరిసింది. మెరవడమే తరువాయి స్థపతులనీ, మేస్త్రీలనీ, వడ్రంగులనీ పిలిపించేడు. మనస్సులో ఉన్న ఊహని వాళ్ళకి చెప్పేడు. వాళ్ళు అదెంత సేపు, చిటికెల మీద పని అన్నారు.

ఈ రాజు మనసు పడుతూన్నది క్రీడారంగాన్ని పోలిన బహిరంగ న్యాయస్థానం. ఈ న్యాయస్థానంలో విచారణకి వచ్చే 'కేసు'లు 'కేపిటల్' కేసులు మాత్రమే. అంటే మరణ శిక్షకి

అర్థమైన కేసులనే విచారించి తీర్పు అయిన తర్వాత ఈ న్యాయ స్థానంలో ప్రజల సమక్షంలో శిక్షని అమలు చేస్తారు. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు కదా. అందుకని రాజుగారే స్వయంగా తీర్పు చెప్పి, శిక్ష విధించి, తనే దగ్గర ఉండి అమలు జరిపిస్తారు.

'ఓస్ ఇంతేనా కథ. ఇందులో విశేషం ఏమిటి?' అని కొట్టిపారెయ్యగల సమర్ధులు మీరని నాకు తెలుసు. కాదనను. మీ వరకూ ఎందుకు? ఇంతవరకూ విన్న మా అమ్మాయి 'ఇంక చాల్లే నాన్నా! ఇదేం బాగు లేదు. చీమ-నల్లి కథ చెప్పెయ్' అని ఒక సారి అంది.

అందరిలాగా వ్యాజ్యం విని ఉరి శిక్ష విధించడమో, వదిలిపెట్టెయ్యడమో చేసేసి ఊరుకునే మనిషైతే ఈ కర్కోటక రాజు గారి కథ మనం చెప్పుకోము కదా. ప్రజల సమక్షంలో శిక్షని అమలు చెయ్యడానికి ఒకటి కంటె ఎక్కువే కారణాలు ఉన్నాయి. ఒకటి, కాలు జారితే వెనక్కి తీసుకోకలం కానీ నోరు జారితే తీసుకోలేమంటారు. అలాగే ఏ శిక్షనైనా రద్దు చెయ్యవచ్చు కానీ, అమలు జరిగి పోయిన మరణ శిక్షని వెనక్కి తీసుకోలేం. అస్త్రాలలో బ్రహ్మాస్త్రం ఎలాంటిదో శిక్షలలో మరణ శిక్ష అలాంటిది. కనుక న్యాయస్థానంలో తీర్పు అయిపోయి, శిక్ష పడిపోయిన తర్వాత ముద్దాయికి ప్రాణం రక్షించుకోడానికి మన రాజు గారు మరొక్క అవకాశం కల్పించేరు. అదే ఆఖరి ఛాన్సు. అది ప్రజల ఎదుట. రాజు గారి రెండవ కారణం ఏమిటంటే - తప్పులు చెయ్యడం వల్ల కలిగే పర్యవసానాన్ని ప్రజలకి గుర్తు చెయ్యడం. మూడవది, ప్రజలని 'ఎంటర్ టెయిన్' చెయ్యడం కోసం! పిల్లికి చెలగాటం, ఎలకకి ప్రాణ సంకటం లా తయారయిన ఇటువంటి పరిస్థితిని కల్పించి, చూసి ఆనందించే మనస్తత్వాన్ని 'సెడిస్టిక్ పెరసనాలిటీ డిసార్డర్' అంటారు. లేకపోతే ఏమిటి చెప్పండి! దేశంలో సమస్యలే లేవా, రాజు గారి కాలక్షేపానికి.

శిక్ష ఏ రోజున అమలు జరగబోయేదీ ముందుగానే ప్రజలందరికీ దండోరా వేసి తెలియబరుస్తారు. ప్రవేశ రుసుం ఉన్నాదని జంకకుండా ప్రజానీకం తండోపతండాలుగా వచ్చి క్రీడారంగాన్ని నింపేస్తారు. ప్రజలు కూడా 'సైకలాజికల్ కేసు' లే అయి ఉండాలి. 'యథారాజా తథా ప్రజా' అని ఒట్టినే అనలేదు.

ఇహ క్రీడారంగం సంగతి. క్రీడారంగం కూడా చిన్నదీ చితకదీ కాదు. అదొక బృహత్తరమైన మూడంతస్తుల భవనం. గుండ్రంగా ఉన్న భవనం లోనికి వెళ్ళడానికి, బయటికి రాడానికి

సువిశాలమైన ద్వారాలు. లోపలికి వెళుతూ ఉంటే ముందస్తుగా కనిపించేది - కళ్ళు చెదిరిపోయే అంత అందంగా - అప్పుడే కత్తిరించబడ్డ పచ్చిక మైదానం. అదే మన రాజు గారి క్రీడారంగం. దీర్ఘవలయం ఆకారంలో ఉన్న ఈ పచ్చిక మైదానం చుట్టూ పావంచాల మాదిరి అమర్చిన వరసలలో కుర్చీలు. చెల్లించిన ప్రవేశ రుసుంని బట్టి ప్రేక్షకులు మధ్యలో ఉన్న వేదికకి దగ్గరగానో దూరంగానో కూర్చోవచ్చు. ప్రజలంతా వచ్చి కూర్చున్న తర్వాత పెద్ద పటాటోపంతో రాజు గారు వచ్చి ఆయన కోసం ప్రత్యేకం అమర్చిన గాజద్దాల గదిలో కూర్చుంటారు.

"మన ఓక్‌లండ్‌లో ఉన్న 'బేస్ బాల్ స్టేడియం' లా ఉంటుందా?"

"అవునమ్మా! కొంతవరకు ఓక్‌లండ్ లో 'కలోసియం' లా ఉంటుందని అనుకోవచ్చు."

రాజు గారు సుఖాసీనులయిన తర్వాత సర్వాంగ సుందరంగా నిందితుడిని అలంకరించి - స్పెయిన్‌లో జరిగే 'బుల్ ఫైటింగ్' లో 'మేటడోర్' లా - మైదానంలోకి తీసుకు వస్తారు. కోర్టులో బోనులో నిలబడ్డట్టు కాకుండా నిందితుడిని ప్రజలందరి సమక్షంలోనూ రాజు ఎదుట నిలబెడతారు. రాజు గారు చెప్పబోయే తీర్పు ఏమిటో అందరికీ ముందుగానే తెలుసు.

నిందితుడికి ఎదురుగా, మైదానంలో ఒక పక్కగా, రెండు పెద్ద తెరలు ఉంటాయి. ఒక తెర మీద 1 అంకె రెండవ తెరమీద 2 అంకె వేసి ఉంటాయి. ఒక తెర వెనుక బోనులో ఆకలితో నకనకలాడుతూన్న పెద్దపులి, రెండవ తెర వెనుక సమాజంలో నేరస్తుడి అంతస్తుకి, హోదాకి, వయసుకి సరి తూగే అందమైన అమ్మాయి - పువ్వుల దండతో సహా - వేచి ఉంటుంది. అమ్మాయి ఎన్నిక కూడా రాజుగారి పర్యవేక్షణలోనే జరుగుతుంది.

ముఖ్యమైన విషయం! ఏ తెర వెనుక ఏది ఉందో ఎవ్వరికీ తెలియదు. ఊహించడానికి కూడా వీలు లేనంత విధంగా కట్టుదిట్టాలు చెయ్యబడతాయి. లోపలి నుండి పులి వాసన గానీ, పువ్వుల వాసనగానీ బయటికి రావు. పులి 'గాండ్రు' మంటే శబ్దం కూడా బయటికి రాదు. అంతలా కట్టుదిట్టం చేసేరు.

రాజు గారు అనుమతిని సూచిస్తూ సేవకులు గంటతో గణగణా రావం చెయ్యగానే నిందితుడు ఏదో ఒక తెరని ఎన్నుకోవాలి.

"లెట్స్ మేక్ ఎ డీల్ ప్రోగ్రామ్ లో లా అన్న మాట" పక్కలో ఉన్న పిల్ల గువ్వపిట్టలా

పలుకుతున్నాదంటే ఇంకా నిద్ర పోలేదన్నమాట.

"అవునమ్మా! మాంటీ హాల్, బాబ్ బార్కర్ మొదలైనవాళ్ళ టి.వి. షోలలో లాగే! అచ్చం అలాగే."

నిందితుడు పులి ఉన్న తెరని ఎన్నుకుంటే ఆకలితో అలమటిస్తున్న పులి అమాంతం మీద పడి వాడిని ఒక ఎముకల పోగులా మార్చెయ్యడానికి రెండు నిమిషాలు కూడా పట్టదు.

"మరయితే రోంలో ఉన్న 'కలోసియమ్' లో 'గ్లేడియేటర్' లా పులితో కుస్తీపట్టి పులిని ఈ అబ్బాయి చంపేస్తే.."

ఏదో నా మానాన నేను కథ చెబుతూ ఉంటే నోరు మూసుకుని వినకుండా ఇలాంటి యక్షప్రశ్నలు వేస్తేనే నాకు కోపం వస్తుంది. కాని కిందటి వేసంగిలోనే మా సంసారం అంతా రోమ్ వెళ్ళి అక్కడ ఉన్న కలోసియమ్ చూసి వచ్చేం కదా. అందుకని మా అమ్మాయి వేసిన ఈ ఎదురుప్రశ్నని నేను 'ఏంటిసిపేటు' చెయ్యవలసింది. చెయ్యలేదు. ఇప్పుడు పచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డంత పనయింది.

"అవునమ్మా! గ్లేడియేటర్ లా మనవాడు పులి పీకని రెండు చేతులతోనూ నులిమి చంపేస్తే వాడికి మరే శిక్షా పడదు. వాడిని మెచ్చుకుని, వాడికి మేకతోలుకి బదులు చచ్చిన పులితోలే కప్పి వాడిని ఇంటికి పంపించేస్తారు. దెబ్బతో మన కథ కంచికి వెళ్ళిపోతుంది. అప్పుడు నువ్వు ప్రశ్నలడక్కుండా నిద్రపోతావ్."

నిందితుడు పిల్ల ఉన్న తెరని ఎన్నుకుంటే వెంటనే పిల్లనిచ్చి మనవాడికి పెళ్ళి చేసేస్తారు అక్కడే! అందరి సమక్షంలోనూ! అందుగ్గాను మరొక తెర (ఈ తెర మీద 1,2 అనే అంకెలేవీ ఉండవు). ఈ తెర వెనక పెళ్ళి జరిపించడానికి ఒక పురోహితుడు, భజంత్రీల వాళ్ళు సిద్ధంగా ఉంటారు. ప్రేక్షకులలో ఉన్న 'సైకలాజికల్ కేసులు' 'వాడి పెళ్ళయింది! ఇదే వాడికి తగిన శిక్ష! ' అని సమర్థించుకుంటారు.

'మరైతే అబ్బాయికి అప్పటికే నిజంగా పెళ్ళయి పోతే?"

మన రాజు గారి పద్ధతి ప్రకారం నిందితుడు తెరవెనుక పిల్లని పెళ్ళి చేసుకుని తీరాలి. అంతకుముందే వాడికి పెళ్ళయిపోతే ఇప్పుడు ఇద్దరినీ ఏలుకోవాలి. కనుక ఒక విధంగా చూస్తే ఇదీ ఒక రకం శిక్షే!

ఈ పద్ధతిలో జరిగే తీర్పు మన రాజు గారికీ, రాజ్యంలో ప్రజలకీ ఒక వినోద కాలక్షేపం.

ఇలా రోజులు దొర్లిపోతూ ఉంటే నేను ఈ కథ చెప్పవలసిన పనే లేదు. రోము కాలిపోతూ ఉంటే నీరో ఫిడేలు వాయిస్తూ కూచున్నాడని మనం చరిత్ర పుస్తకాలలో చదువుకున్నట్లే, ఫలనా కర్కోటకుడు ఫలానా విధంగా ప్రవర్తించేడని చదువుకుని ఉండేవాళ్ళం. కానీ జరిగిన తంతు అది కాదు.

ఒక రోజున మన రాజు గారి ముద్దుల కూతురు – మొన్న మొన్నటి వరకూ పక్కన పడుక్కుని కథలు చెప్పించుకున్న చిట్టితల్లే – రాజ్యంలో ఉన్న ఒక బాలాకుమారుడిని చూసింది. చూసి మనసు పడింది. పడడం ఏమిటి ప్రేమించేసింది. మొదట్లో చాటుగానో మాటుగానో ఇద్దరూ కలుసుకునే వారు. ఏ చెట్టుకిందో, తుప్పవెనుకో ఒకరి ఒడిలో మరొకరు ఒదిగి పోయేవారు. ఇలా గుట్టుగా ప్రేమించేసుకుని పెదిమలు కొరికేసుకుంటూ ఉంటే గొడవే ఉండేది కాదు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు వీళ్ళిద్దరూ బరి తెగించి కోట వెనక వున్న బాడవ తోటలో 'స్టెప్పులు' వెయ్యడం మొదలు పెట్టేరు. ఇలా గుట్టు రట్టవడం చూసిన రాజభటులో, కిట్టని వాళ్ళో ఈ వార్తని చల్లగా రాజు గారి చెవిలో వేసేసేరు.

ఆయన ఉగ్రుడై పోయాడు. అగ్గిరాముడై పోయాడు. నిగనిగలాడుతూన్న నిప్పుల మీద సాంబ్రాణి వేసినట్లు భగ్గుమన్నాడు. వయస్సులో ఉన్న వాళ్ళు ప్రేమించుకోవడంలో మనకి తప్పు కనిపించకపోవచ్చు. కాని మన మంకు పట్టు రాజు గారికి ఈ ప్రేమ వ్యవహారం నచ్చలేదు. చేసిన 'తప్పు' కి ఇద్దరూ సమంగా బాధ్యులే అయినప్పటికీ కూతురిని ఏమైనా అంటే రాణిగారు రాజు గారిని బతకనిస్తుందా? ఆయన ఊరంతటికీ రాజు కానీ పెళ్ళాం దగ్గర కాదుగా. అందుకని తప్పంతా కుర్రాడిదే అనిన్నీ, తన కూతురిని ప్రేమించడంతో పాటు వాడు చేసిన తప్పులు ఇంకా చాలా ఉన్నాయనీ, అసలు వాడి దగ్గర 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్' వంటివి కూడా ఉంటే ఉండచ్చనీ, ఇలా ఎన్నో నేరాలని కుర్రాడి మీద ఆరోపించి, వాడి తరఫున వకాల్తా పుచ్చుకోడానికి కూడా మనిషిని దొరక్కుండా చేసేసి, విచారణంతా రహస్యంగా జరిపించేసి, కుర్రాడిని క్రీడారంగానికి తీసుకురమ్మని దండన విధించేసేరు.

'ఆలస్యం అమృతం విషం' అన్నారు కనుక శనివారమే వాడిమీద తుది తీర్మానానికి క్రీడారంగం

లో ఏర్పాట్లు చేసేరు.

ఇది 'ఓ.జె. సింప్సన్ కేసు' కంటే ఎక్కువగా ప్రజల దృష్టిని ఆకర్షించింది. దేశంలో ఉన్న ప్రజలు, పక్క దేశాలలో ఉన్న ప్రజలు తండోపతండాలుగా వచ్చి క్రీడారంగంలో ఇసకేస్తే రాలకుండా కిటకిటలాడిపోయేరు. కాథాకాలం నాటికి వార్తాపత్రికలు, టెలివిజన్ ఉన్నాయో లేదో నాకు తెలియదు కాని, అవి ఉండుంటే న్యూస్ పేపర్ రిపోర్టర్లు, టెలివిజన్ రిపోర్టర్లు కూడా - సేటలైట్ డిష్‌లతో సహా - వచ్చే ఉండుంటారు.

'ఆడిటోరియం' కిటకిటాలాడిపోతోంది. బటానీలు, వేరుశనక్కాయలు, పీచుమిఠాయి, బీరు, 'హాట్‌డాగ్' లు మొదలైన వాటి అమ్మకాల వల్ల వచ్చిన లాభాలతో రాజు గారి ఖజానా నిండిపోతోంది. క్రీడారంగం అంతా తిరణాల వాతావరణంతో మోగిపోతోంది.

ఇంతలో రాజు గారు వచ్చి సుఖాసీనులయ్యేరు.

ఒక్కసారి స్టేడియం అంతా నిశ్శబ్దంతో నిండిపోయింది.

రాజు గారు కూర్చున్న గాజద్దాల గది కిందనే ఉన్న ఒక సొరంగం ద్వారా దోషిని తీసుకు వచ్చి రాజు గారి ఎదట నిలబెట్టేరు.

ఆ వ్యక్తిని చూసి అంతా ఔరా అని ముక్కు మీద వేలేసుకున్నారు.

అతను జానుబాహువు. కండలు తిరిగిన శరీరం. నవయవ్వనంలో ఉన్న బలశాలి. వర్చస్సు చూస్తే రాకుమారుడిలా ఉన్నాడు కాని సామాన్యుడిలా లేడు. అందానికి, ఆకర్షణకి రాకుమార్తెకి ఏ మాత్రమూ తీసిపోడు. ఆ వ్యక్తిని చూసి ప్రేక్షకులలో ఉన్న ఆడవాళ్ళు ఉవ్విళ్ళూరేరంటే అది అతిశయోక్తి కాదు. ఈడూ, జోడూ కుదిరింది. ఇటువంటి వ్యక్తిని ఎన్నుకుని ప్రేమించినందుకు రాకుమారిని అభినందించాలి కానీ ఏమిటీ వీధి భాగోతం అని కొందరు గుసగుసలాడుకున్నారు.

మహాసముద్రంలా ఉన్న జన సందోహం మధ్యలో నిలబడి ఎవరికోసమో దోషి కళ్ళు వెతుకుతున్నాయి. గాజద్దాల తలుపుల వెనక రాజుగారికి కుడి పక్కన రాణి గారు, ఆమె పక్కన రాకుమారి కనిపించేరు. ఆమె వైపే చూస్తున్నాడు మన దోషి. ఆశగా చూస్తున్నాడు.

రాకుమార్తె తలచుకుంటే ఏ తెర వెనుక ఏమి ఉందో తెలుసుకోలేక పోతుందా! ఆ విషయం తెలిసిన తర్వాత తనకి ఏదో విధంగా సంకేతం ద్వారా తెలియజెయ్యక పోతుందా అన్న చిన్న

ఆశ ఒకటి అతని బుర్రలో మొలకెత్తింది.

అంతలోనే నిరాశ. ఇప్పుడు తనకి ప్రాణదానం చేస్తే రాకుమార్తెకి ఒరిగేదేముంది? పులి ఉన్న తెరని తప్పించి పిల్ల ఉన్న తెరని అతను ఎంచుకుంటే పిల్లని ఇచ్చి బలవంతంగానైనా పెళ్ళి జరిపిస్తాడు కర్కోటక రాజా.

చేజారిపోయిన తన ప్రియుడికి మరొకరిని కట్టబెడితే రాకుమార్తె చూస్తూ చూస్తూ సహించగలదా? సహించడం మాట దేవుడెరుగు, సహకరించ గలిగే అంత పెద్ద మనస్సు ఉంటుందా ఆ అమ్మాయికి?

ఏమో. ప్రాణం మీద ఆశ మహా దొడ్డది. అందుకని ఆమె వైపే చూస్తున్నాడు, ఏదైనా సంకేతం కోసం.

గడియారపు స్థంబం మీద గడియారం చేస్తూన్న 'టిక్కు టిక్కు' శబ్దం తప్ప క్రీడారంగం నిశ్శబ్దంగా తాయారయింది. ప్రజలు ఉత్కంఠ భరించలేక పోతున్నారు.

రాకుమారి మనస్సు కూడా పరిపరి విధాల పోతోంది. నిందితుడికి తను సహాయం చేసినట్లు వెల్లడి అయితే అది రాజద్రోహం. ఎంత తండ్రి అయినా మొండివాడు కదా. పైపెచ్చు కర్కోటకుడు. ఏ వేళప్పుడు ఏ కళలో ఉంటాడో?

ఇలా మీనమేషాలు లెక్కెట్టుకుంటూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది. ముఖం మీద పడుతూన్న ముంగురులని కుడిచేత్తో పైకి రెండు సార్లు ఎగదోసింది.

అదే తనకి కావలిసిన సంకేతం అని దోషి భావించేడు.

ఇంతలో గడువు కాస్తా అయిపోయింది. రాజు గారు సంజ్ఞ చేసేరు. తెర తెరవడానికి ఆజ్ఞ అయిందంటూ సేవకుడు గంట గణగణ మోగించేడు.

అందరూ ఊపిరి బిగపట్టుకుని దోషి ఏ తెర ఎన్నుకుంటాడా అని ఉత్కంఠతో ఉన్నారు.

ముద్దాయి రెండవ నెంబరు తెర వైపు వడిగా, నిస్సంకోచంగా నడుస్తున్నాడు.

అందరూ ప్రాణాలు బిగపట్టుకుని ఉన్నారు.

గంట ఇంకా మోగు తోంది.

చీకటిలో తడుముకుంటూ టేబుల్ మీద ఉన్న అలారం గడియారాన్ని కిందకి తోసేస్తూ అతను

దిగ్గున లేచేడు.

గంట ఇంకా మోగుతోంది.

టెలిఫోను అందుకుని 'హల్లో' అన్నాడు.

"అన్నయ్యా, నేనురా పిలుస్తున్నాను. ఏం నిద్ర పోతున్నావేమిటి?"

"ఇంక లేదులే. లేపేసేవు కదా! ఏమిటి, ఎందుకు పిలిచేవు."

"ఏమీ లేదురా. నీకు పీడకలలు వస్తూ ఉండేవి కదా. అవి ఎందుకు వస్తాయో 'సైకాలజీ టుడే' లో ఒక మంచి వ్యాసం చూసేను. నీకు చెబుదామని పిలిచేను. ఈ వేళప్పుడు నువ్వు పడుక్కుంటావనుకో లేదు."

"ఉద్ధరించ లేక పోయేవురా! కుర్రాడు తెరిచిన తెర వెనుక ఏముందో తెలియడానికి అవకాశం లేకుండా చేసేవు కదరా! అతన్ని పులి తినేసిందో లేక తెర వెనక ఉన్న పిల్లతో అతనికి పెళ్ళే అయిందో? పెళ్ళే అయితే రాకుమారి ప్రేమ సంగతి ఏమయినట్లు? ఏదీ తేలకుండా చేసేవుకదరా?

"ఫోను చేతిలో ఉంది కదా అని వేళా పాళా చూసుకోకుండా కాల్చేసెయ్యడమే!"